స్టేజీల్లో బస్సులు ఆపండి సారూ..!



కున్సీ గేట్‌లో కర్ణాటక బస్సులు నిలపాలని ధర్నా చేస్తున్న ప్రయాణికులు(ఫైల్)

- చేగుంట, కున్సీ గ్రామస్తులకు ప్రయాణ కష్టాలు
- రాకపోకలు సాగిస్తున్న కర్ణాటక బస్సులు
- యాద్గీర్, రాయచూర్ డిపో మేనేజర్లకు పలుమార్లు విజ్ఞప్తి
- పట్టించుకోని అధికారులు, ఆందోళనలో ప్రయాణికులు

కృష్ణా: కృష్ణా మండలం కర్ణాటక సరిహద్దులో ఉండడంతో ఈ ప్రాంత ప్రజలు ప్రతినిత్యం తమ అవసరాలకు, వ్యాపారాలకు, రైతులు మార్కెట్‌కు వెళ్లడానికి, కర్ణాటకలోని రాయచూర్, యాద్గీర్ పట్టణాలకు ప్రతిరోజు వందలాది మంది ప్రయాణికులు వెళ్తుంటారు. మండలంలోని కున్సీ, చేగుంట గ్రామాల ప్రజలు ఈ పట్టణాలకు వెళ్లాలంటే కర్ణాటక కు చెందిన బస్సుల్లోనే ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ ప్రాంతం నుంచి ఆ పట్టణాలకు వెళ్లడానికి తెలంగాణ బస్సుల సర్వీసులు ఉండవు. కర్ణాటక బస్సులోనే ఆ రెండు గ్రామాల ప్రజలు ప్రయాణించాల్సి ఉంటుంది. నిత్యం అరగంటకు ఒకటి చొప్పున ఈ గ్రామాల నుంచే కర్ణాటకలోని రాయచూర్, యాద్గీర్ డిపోల బస్సులు వెళ్తుంటాయి. కానీ ఈ గ్రామాల స్టేజీల్లో మాత్రం బస్సులు నిలపడం లేదు. ఈ విషయంపై పలుమార్లు ఆయా గ్రామాల నాయకులు డిపో మేనేజర్లకు స్టేజీల్లో బస్సులు నిలపాలని విజ్ఞప్తి చేశారు. అయినా వారు ఆ స్టేజీల్లో బస్సులు నిలపడం లేదు. దీంతో ఆ గ్రామాల ప్రజలు హిందుపూర్ గ్రామ స్టేజీ నుంచి ఎక్కడం, అక్కడే దిగడం చేస్తున్నారు. ఆ స్టేజీ నుంచి చేగుంటకు సరిగ్గా 10 కిలోమీటర్లు, కున్సీ గ్రామానికి 6 కిలోమీటర్లు దూరంలో ఉంటుంది. ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రాంత అధికారులు చొరవ తీసుకొని ఈ గ్రామాల స్టేజీల్లో కర్ణాటక బస్సులు నిపినట్లయితే ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుంది.

బస్సులు నిలపక చాలా ఇబ్బందులు



జాతీయ రహదారిపై ఉన్న మా కున్సీ గ్రామ స్టేజీలో కర్ణాటక బస్సులు నిలపకపోవడం వల్ల నిత్యం ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో మాకు ఆర్థికంగా నష్టం ఏర్పడి, సమయం వృథా అవుతోంది. ఈ విషయంలో కలెక్టర్ తగు చర్యలు తీసుకొని బస్సులు సేజీలో నిలిపేలా చూడాలి.

– బస్వరాజ్, కున్సీ

రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో బస్సు కనపించదు



రాష్ట్ర సరిహద్దులోని మా చేగుంట గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం ఉన్నప్పటికీ ఆర్‌టీసీ బస్సులు రావడం లేదు. పైగా కర్ణాటక బస్సులు ఉన్నా వాటిని మా గ్రామ స్టేజీల్లో నిలపడం లేదు. దీంతో ప్రయాణానికి చాలా ఇబ్బందులున్నాయి. తెలంగాణ, కర్ణాటక అధికారులకు పలుమార్లు ఈ సమస్యను చెప్పినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు మా ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని న్యాయం చేయాలి.

– బస్వరాజ్‌స్వామి, చేగుంట

ప్రేమ్‌చంద్ జీవితం అందరికీ ఆదర్శం



ప్రేమ్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

నారాయణపేట రూరల్: హిందీ జాతీయ కవి ప్రేమ్‌చంద్ జయంతి సందర్భంగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాలలో ఆయన చిత్ర పటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల అధ్యక్షుడు శేషమ్మ మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి ఒక్కరూ ఆయనను ఆదర్శం తీసుకోవాలన్నారు. బాల్యం నుంచే అనేక బాధలు, కష్టాలు అనుభవించి జీవితంలో గొప్ప స్థాయికి ఎదిగారని తెలిపారు. పాఠశాలలో చదువుకొనే రోజుల్లో తోటి విద్యార్థులకు చదువు చెపుతూ ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగం చేస్తూ అనేక డిగ్రీలు పొందారన్నారు. సమాజంలో పేదరికం, సామాజిక అసమానతలపై రచనలు చేసి అనేక మార్పులు తీసుకొచ్చారని, దేశ స్వాతంత్ర్యం ఉద్యమంలో పాల్గొని అనేక సార్లు జైలుకు వెళ్లారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బాలప్ప, అమీనా, హెచ్.నర్సింహ, మనీలా, రాజశ్రీ పాల్గొన్నారు.

మద్దూరు: ప్రముఖ హిందీ నవల రచయిత, ఉపన్యాస సామ్రాట్ మున్షి ప్రేమ్‌చంద్ జన్మదినోత్సవం సందర్భంగా మద్దూరు బాలుర ఉన్నత పాఠశాలలో అయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సవిత, ఉపాధ్యాయులు యశ్వత్, విజయలక్ష్మి, సునీత, సాజిత్, బందయ్య పాల్గొన్నారు.

పనులను పరిశీలించిన డీసీడీఓ



ధన్వాడ: మండల కేంద్రంలోని తెంగాణ మోడల్ పాఠశాలలో ఉన్న హాస్టల్ (కస్తూర్బా గాంధీ టైప్–4) లో జరుగుతున్న మరమ్మతు పనులను డీసీడీఓ నర్మద పరిశీలించారు. గతవారం మరుగుదొడ్ల లీకేజీ వల్ల స్నానాలు చేయలేకపోతున్నామని విద్యార్థులు రోడ్డుపై బైఠాయించిన విషయం విదితమే. దీంతో కలెక్టర్ ఫండ్స్ నుంచి వసతిగృహంలో అధికారులు మరమ్మతు పనులు నిర్వహిస్తున్నారు. దీంతో పనులు ఆమె పరిశీలించారు. 10 రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆమె తెలిపారు. పనులు పూర్తి అయ్యేవరకు విద్యార్థులు కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఉంటున్నారు.

బాల్యవివాహాలు, మాదకద్రవ్యాలను అరికట్టాలి



బాలలసభలో మాట్లాడుతున్న పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి

నర్వ: బాల్యవివాహాలు, మాదకద్రవ్యాలను అరికట్టాలని బాలలసభ అధ్యక్షురాలు అఖిల అన్నారు. గురువారం నర్వ ఉన్నత పాఠశాలలో 8 నుంచి 18 ఏళ్ల బాలబాలికలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 7 విభాగాలు విద్య, వైద్యం, రక్షణ, స్వచ్ఛత, సమాచారం, సంస్కృతి, క్రీడలశాఖలపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. విద్యార్థులు బడిమానేయడానికి గల కారణాలు, బాల్యవివాహాలు, మాదకద్రవ్యాలు నిరోధించుటకు గల కారణాలపై విద్యార్థులతో మాట్లాడి మినిట్స్ నోట్‌చేయించారు. సమావేశంలో ఎంఈఓ రాం రెడ్డి, ఎస్‌ఐ రమేష్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి బుచ్చారెడ్డి, హెల్త్‌డిపార్టుమెంట్ సీహెచ్‌ఓ రాము, నశముక్తభారత్ లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



నారాయణపేట టౌన్: పని గంటలు జీఓ 282ను వెంటనే రద్దు చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని టీయూసీఐ ఉపాధ్యక్షుడు హన్మేష్ అన్నారు. ఈ మేరకు ఆయన గురువారం జిల్లా కేంద్రంలోని స్థానిక మున్సిపల్ పార్కు ఎదుట నిర్వహించిన కార్మికుల ధర్నా పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ 8 గంటల పని విధానం రద్దు చేసి 282 జీఓ తెచ్చి 10 గంటల పని విధానాన్ని తెచ్చి కార్మికులపై పని భారాన్ని పెంచిందన్నారు. ఇచ్చిన హామీలు వెంబడే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు కిరణ్, ప్రధాన కార్యదర్శి రాము, జిల్లా ఉపాధ్యక్షుడు కాశీనాథ్ పాల్గొన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మణికంఠగౌడ్

నారాయణపేట రూరల్: ప్రతి ఒక్కరూ తూచ తప్పకుండా ఆరోగ్య నియమాలు పాటిస్తే రోగాల బారిన పడకుండా నివారించవచ్చని డాక్టర్ విరోజా అన్నారు. చిన్న జట్రం సబ్ సెంటర్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బోయిన్‌పల్లి తండాలో నిర్వహించిన హెల్త్ క్యాంప్‌లో ఆమె వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణులు తీసుకోవల్సిన జాగ్రత్తలు వివరిస్తూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చిన్నారులకు తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



బోయిన్ పల్లి తండాలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ విరోజా

గురుకులంలో వైద్య పరీక్షలు

మక్తల్: పట్టణంలో యల్లమ్మకుంటలో ఉన్న బీసీ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులకు మక్తల్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్య ఆంజనేయులు ఆధ్వర్యంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. పోగ్రాం చైర్మన్ మణికంఠగౌడ్, కో చైర్మన్ డాక్టర్ రాజేష్‌గౌడ్, లయన్ డాక్టర్ అశోక్, ప్రిన్సిపాల్ రేవతి, డాక్టర్ తిరుపతి, శ్రీధర్, అడేం సత్యనారాయణ, జైపాల్‌రెడ్డి, రాజుల ఆశిరెడ్డి, శ్రీరామ్ పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే పాడుబడ్డ బావి



మరికల్: మండలంలోని కన్మనూర్ గ్రామంలో రోడ్డు పక్కనే ప్రమాదకరమైన పాడుబడ్డ బావి ప్రమాదాలకు నిలయంగా మారింది. మరికల్ నుంచి నర్వ వివిధ గ్రామాలకు ఇదే రోడ్డు మార్గం ద్వారా బస్సులు, ఇతర వాహనాలు వెళ్తుంటాయి. గతంలో వాహనాలు అదుపు తప్పి ఈ బావిలో పడ్డ సంఘటనలున్నాయి. రాత్రి సమయంలో మూగజీవాలు సైతం అందులో పడి ప్రాణాలు కోల్పోయిన ఘటనలున్నాయి. దీంతో బావిని పూడ్చాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులను, అధికారులను వేడుకుంటున్నారు. బావిని పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



పేకాడుతున్న వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు

కృష్ణా: మండలంలోని గుర్జాల్ శివారులోని శరణప్ప పొలంలో కర్ణాటక, తెలంగాణ ప్రాంతాలకు చెందిన కొందరు పేకాడుతుండగా.. గురువారం కృష్ణా ఎస్ఐ ఎండీ నవీద్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించి నలుగురిని అరెస్ట్ చేశారు. ఈ విషయంపై ఎస్ఐ విలేకరులతో మాట్లాడుతూ.. చట్టవిరుద్ధంగా గుట్టుచప్పుడు కాకుండగా పేకాడుతున్న రాజు గుల్బర్గ, నర్సింగ్ హిందుపూర్, ఎండీ యూనిస్ యాద్గీర్, ఎండీ రియాజ్ ఉట్కూర్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. వీరి నుంచి పేకాట ముక్కలతోపాటు రూ.30, 550 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇందులో ఏఎస్ఐ సురేంద్రబాబు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేటినుంచి ఎస్‌బీఎంలో ప్రవేశాలకు ఆహ్వానం

జడ్చర్ల టౌన్: మండలంలోని పోలేపల్లి వద్ద ఉన్న ఎస్‌ఎంఐఎంఎస్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ క్యాంపస్ ఎంబీఏ ప్రోగ్రామ్స్‌లో శుక్రవారం నుంచి ప్రవేశాలు ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులకు తగిన వేదిక నందిస్తున్నామని నిర్వాహకులు ప్రకటించారు.

క్లుప్తంగా

సులేమాన్ సాహెబ్ దర్గా పనులు ప్రారంభం



ఊట్కూరు: మండలంలోని పగిడిమారి గ్రామంలోని సైయ్యద్‌సులేమాన్ సాహెబ్ బాబా దర్గా పునర్ నిర్మాణ పనులు గురువారం భక్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా హిమామ్‌కతాల్‌హుస్సేన్ ఆధ్వర్యంలో దర్గాలో ప్రత్యేక ప్రార్థన చేశారు. అనంతరం దర్గా స్లాబ్ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జాఫర్, భక్తులు ఘని, హుస్సేన్, ఇస్మాయిల్, ఆహ్మద్‌హుస్సేన్ పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్యశిబిరం



నారాయణపేట రూరల్: జిల్లాలోనే మొదటి సారిగా కిడ్నీ, మూత్ర సంబంధిత వ్యాధిపై ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ హరినారాయణ బట్టడ్ తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 2న శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు స్థానిక గీతా మల్టీస్పెషాలిటీ హాస్పిటల్లో క్యాంప్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రఖ్యాత కిడ్నీ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కే.వివేకానంద పర్యవేక్షణలో కిడ్నీ మూత్ర సంబంధిత వ్యాధిపై ఉచిత చికిత్సతో పాటు మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు. కిడ్నీలో రాళ్లు, మూత్రంలో మంట, అతిమూత్రం, మగవారిలో సంతాన లేమీ సమస్యలు, ప్రొస్టేట్, కిడ్నీ బ్లాడర్ క్యాన్సర్ తదితర చికిత్సలు అందిస్తారని పేర్కొన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ మేరకు కరపత్రం విడుదల చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు సరిత బట్టడ్, డాక్టర్ గీత, విశ్వనాథ్, క్లబ్ కార్యదర్శి సాయినాథ్ కోశాధికారి రాధ, సదానంద్‌చారి, గందె ఉమాకాంత్, భీంచందర్, సురేందర్ చారి డాక్టర్ ఖాసిఫ్, డాక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేడు ఊట్కూరుకు మంత్రి రాక

ఊట్కూరు: ఊట్కూరులోని రైతు వేదిక భవనంలో శుక్రవారం రేషన్‌కార్డుల పంపిణీ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి హాజరవుతున్నట్లు గురువారం కాంగ్రెస్ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, కోరం మహేష్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రేషన్‌కార్డు లబ్ధిదారులు, మండల నాయకులు హాజరు కావాలని కోరారు.

ఎంపీడీఓగా రహమతుద్దీన్

మద్దూరు: నూతన ఎంపీడీఓ రహమతుద్దీన్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ నర్సింహారెడ్డి పదవీ విరమణ పొందడంతో, మక్తల్‌లో పనిచేస్తున్న రహమతుద్దీన్ ఇక్కడి బదిలీపై వచ్చారు. మద్దూరు మండలంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

హెచ్ఐవీపై ఆశా వర్కర్లకు అవగాహన



ఊట్కూరు: మండలంలోని పులిమామిడి ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం హెచ్ఐవీపై సంపూర్ణ సురక్ష కేంద్రం మేనేజర్ కార్తీక్ ఆశా వర్కర్లకు, ఏఎన్ఎంలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్, హెపటైటీస్ బీ,సీ, టీబీ తదితర దీర్ఘకాలిక రోగాలపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిరాం, డాక్టర్ సూర్యప్రకాష్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మట్టి గోడ



ఊట్కూరు: ఊట్కూరులోని శివాజీనగర్‌లో మట్టి గోడ ప్రమాదకరంగా మారిందని కాలనీవాసులు వాపోతున్నారు. నిత్యం వర్షాలు కురుస్తుండడంతో మట్టి గోడ ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, డ్రైయినేజీ లేకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. అధికారులు స్పందించి మట్టి గోడను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు



మాగనూర్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: ప్రభుత్వం అభివృద్ధి చేస్తామంటే మేము కూడా సహకరిస్తామని, వారు చేసే పనులు ప్రజలకు ఇబ్బంది కలిగే విధంగా ఉండొద్దని మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని పెద్ద వాగు నుంచి కొడంగల్, నారాయణపేట ఎత్తిపోతల పథకం పైపులైన్ తయారు కోసం ఇసుక తరలించడాన్ని అడ్డుకున్నారు. మాగనూర్ పెద్ద వాగు దగ్గర ఇసుక తరలిస్తే గ్రామస్తులు తాగునీటికి, రైతులు సాగునీటికి తీవ్రంగా ఇబ్బందులు పడుతారన్నారు. గతంలో తాము అధికారంలో ఉన్న సమయంలో ఈ ప్రాంతం నుంచి ఎవరిని ఇసుక తరలించనివ్వలేదని గుర్తు చేశారు. పైపుల తయారు కోసం ఇసుకను అడవిసత్యావార్‌లోని టీజీఎండీసీ నుంచి లేదా దాసర్‌పల్లి శివారులోని మన ఊరు–మన ఇసుక వాహనం ద్వారా తరలిస్తున్న ప్రాంతం నుంచి తీసుకువెళ్లాలని తెలిపారు. అలా కాదని మాగనూర్‌ను ఎడారిగా మరుస్తామంటే చూస్తు ఊరుకోమన్నారు. అనంతరం చిట్టెం నర్సిరెడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కుడి లోలెవల్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించాలని ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. కొన్ని రోజులుగా కెనాల్ రైతులకు సాగునీరు రావడం లేదని, తమ దృష్టికి తీసుకురావడంతోనే ఈ కాలువలను పరిశీలించానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వడ్వాట్ మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్, మాజీ సర్పంచ్ నర్సింహులు, అశోక్‌గౌడ్, మల్‌రెడ్డి, పూలరాములు, ఈశ్వర్‌యాదవ్, నేతాజీరెడ్డి, రవి, పల్లె మారెప్ప, బసంత్‌రెడ్డి, అశోక్‌గౌడ్, సాయిబన్న పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడి



అవగాహన కల్పిస్తున్న ఏఈఓ తిరుపతి

కోస్గి రూరల్: రసాయనిక ఎరువులకు బదులుగా సేంద్రియ ఎరువులు వాడటం ద్వారానే అధిక దిగుబడి సాధించవచ్చని గురువారం వ్యవసాయ విస్తారణ అధికారి తిరుపతి అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న నేషనల్ మిషన్ ఆన్ న్యాచురల్ ఫార్మింగ్‌లో భాగంగా గుండుమాల్ మండలంలోని సారంగరావుపల్లి గ్రామం ఎంపికై ందన్నారు. పలు పంట పొలాల్లో మట్టి నమూనాలు సేకరించడంపై అవగాహన చేపట్టారు. రసాయనిక ఎరువులను కాకుండా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న 125 మంది రైతులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో రైతులు వెంకటయ్య, కేశవులు, గెమ్యానాయక్, గోపాల్‌నాయక్ తదితరులున్నారు.

ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న వింధ్య నాయక్

నారాయణపేట రూరల్: విద్యార్థి దశలో ర్యాగింగ్ భూతానికి దూరంగా ఉండాలని లీగల్ సర్వీస్ కార్యదర్శి వింధ్య నాయక్ తెలిపారు. గురువారం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్సియల్ బాయ్స్ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ ముప్పు నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ర్యాగింగ్ చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. ర్యాగింగ్ చేసిన, సహకరించి న వారికి సమాన శిక్ష ఉంటుందన్నారు. సీనియర్ విద్యార్థులు కొత్తగా వచ్చిన విద్యార్థులకు మనస్థాపం కలిగించే రీతిలో ప్రవర్తించరాదని, బాల్య వివాహాలు, విద్యార్థులను ప్రేమ పేరుతో పీడించడం, కలవరపెట్టడం, అవమాన పరచడం వంటివి నేరంగా పరిగణించి ఆరునెలల జైలు శిక్ష, రూ.వేయి జరిమా నా విధించవచ్చన్నారు. విద్యార్థులు గొడవలకు దూరంగా ఉండాలి అన్నారు. దాడి చేయడం, నేర పూరితమైన శక్తిని ప్రదర్శించి తోటి విద్యార్థులను భయపెట్టడం మొదలగునవి ర్యాగింగ్‌గా బావించవచ్చని చట్టపరంగా కఠినంగా శిక్షార్హులు పైగా గవర్నమెంట్ ఉద్యోగాలకు అనర్హులు అవుతారన్నారు. సైబర్ నేరాలు, హెల్ప్‌లైన్, టోల్ ఫ్రీ నంబర్స్ తదితర అంశాలపై విద్యార్థులకు వివరించారు. న్యాయ వ్యవస్థలో ఉచిత న్యాయ సలహాలు ఇచ్చేందుకు లీగల్ డిఫెన్స్ సిస్టం ఉందన్నారు. మహిళలు, ఎస్సీ, ఎస్టీ, రూ.3లక్షల లోపు ఆదాయం కలిగిన బీసీలకు ఉచిత న్యాయ సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో సురేష్, లక్ష్మీపతి గౌడ్, నాగేశ్వరి, నందు నామాజీ, క్రాంతి, కళాశాల ప్రిన్సిపాల్ జగదీశ్వర్ ఉపాధ్యాయులు, పోలీస్ అధికారి పారాలీగల్ వలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్

నారాయణపేట రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని హెడ్ కానిస్టేబుల్ కుర్మయ్య అన్నారు. ప్రతినెల చివరి రోజున నిర్వహించే పౌరహక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) రూరల్ పీఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని అభంగాపూర్ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని, కుల వివక్షను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, దానికి కృషి చేయాలన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ, ఎస్టీ కులాల వారి నిచైతన్య పరిచి అభివృద్ధి వైపు నడిపించడానికి కృషి చేద్దామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో పౌర హక్కుల రక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్యంగా ఉండాలని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణుగోపాల్, పీసీ రవినాయక్, పంచాయతీ కార్యదర్శి శివ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

కుల రహిత సమాజమే లక్ష్యం



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: కుల రహిత సమాజమే లక్ష్యం అని రెవెన్యూ ఎంఆర్ఐ బల్‌రాజు అన్నారు. గురువారం వాడ్వట్ గ్రామంలోని గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామాలలో కులాలపై జరుగుతున్న వివక్ష దోరణి విడనాడాలనే అంశంపై గ్రామస్తులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. భారతదేశంలో ఇప్పటికి కొన్ని గ్రామాలలో కులాల పేరుతో మనుషులను విభజిస్తూ వారికి హోటళ్లలో ప్రత్యేక గ్లాసలలో చాయి, టిఫిన్ లాంటి వస్తువులు సరఫరా అవుతున్నాయని, గ్రామానికి దూరంగా ఉంచడం వంటి సంఘటనలు చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. ఏఎస్ఐ మన్నన్, కానిస్టేబుల్ నర్సింహులు, శివకుమార్ పాల్గొన్నారు.

పింఛన్ పంపిణీకి ఆటంకాలు



పోస్టాఫీసు బయట వేచి చూస్తున్న పింఛన్ దారులు

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారం గ్రామంలో గురువారం పోస్టాఫీస్‌లో ఫేస్ రికగ్నిషన్ (ముఖ గుర్తింపు) ద్వారా పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు. ఇదివరకు వితంతు, వృద్ధాప్య, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు పోస్టాఫీసులో బయోమెట్రిక్ ద్వారా పింఛన్ పంపిణీ చేసేవారు. రాష్ట్ర ప్రభుత్వం ఫేస్ రికగ్నిషన్ ద్వారా పింఛన్లు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో పంపిణీ చేశారు. దీనికి సంబంధించిన ఎక్విప్‌మెంట్లు (పరికరాలు) సకాలంలో అందకపోవడంతో బ్రాంచ్ పోస్టు మాస్టర్ మహ్మద్ గౌస్ తమ సెల్‌ఫోన్‌లో యాప్ ను ఇన్‌స్టాల్ చేసి డబ్బులు పంపిణీ చేశారు. సర్వర్ ప్రాబ్లమ్ రావడంతో 20 శాతం మందికి పాత పద్ధతి బయోమెట్రిక్ ద్వారా డబ్బులు పంపిణీ చేశారు. సర్వర్ డౌన్ నేపథ్యంలో లబ్ధిదారులు పోస్టాఫీసు ముందు పడిగాపులు పడాల్సి వచ్చింది.

రైల్వే వంతెన రోడ్డుకు మరమ్మతు జరిగేనా?



మరికల్: జాతీయ రహదారి నుంచి బూడ్యాగానితండాకు వెళ్లే రహదారిపై నిర్మించిన రైల్వే వంతెన కింద రోడ్డు మరమ్మతుకు నోచుకోకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వస్తే వంతెన కింద భారీగా వర్షాపునీరు నిస్తుంది. దీంతె బైక్‌లు, వాహనాలు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంది. రైల్వే శాఖ అధికారులు స్పందించి మండలంలోని పెద్దచింతకుంట, ఇబ్రహీంపట్నం, బూడ్యాగానితండాకు వెళ్లే రోడ్లపై ఉన్న రైల్వే వంతెన కింద వర్షాపు నీరు వెళ్లడానికి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.